విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 15 జూన్ 2025 8 పేజీలు

సాగుకు సహకారమేది..?

- చొరవలేని మార్కెటింగ్‌శాఖ
- ఇతోధికంగా రుణాలు ఇచ్చే రోజులొచ్చేనా?

ప్రభుత్వం పకడ్బందీ ఖరీఫ్ ప్రణాళికతో సిద్ధంగా ఉన్నా...విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినా...వర్షాలు సంతృప్తికరంగా కురుస్తున్నా...రైతుకు పూర్తిస్థాయి సాంత్వన లేదు. కీలకమైన మార్కెటింగ్ విభాగం, సహకార రంగంలో చొరవ లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. గతంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు రైతు సేవలలో తరించేవి. ఇతోధికంగా రుణాలు ఇచ్చేవి. రైతులకు అనేక పథకాలు అమలు చేసేవి. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పశు పెంపకం, వైద్య శిబిరాలు, ఇతర ప్రోత్సాహకాలు అందించేవి. నేడు ఈ రెండు శాఖలు ఆ సేవలు తమవి కానట్టు వ్యవహరిస్తున్నాయి.

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: జిల్లాలో ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. కురుస్తున్న వానలతో అన్నదాత అంతా దాదాపు పొలం బాట పట్టారు. విరివిగా చుక్కలు చేపడుతున్నారు. ఓ ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఇది హర్షించదగ్గ పరిణామమే. సంప్రదాయంగా వ్యవసాయ అనుబంధ రంగాలు, శాఖలు అభివృద్ధి చెందితేనే సాగుకు పూర్తి భరోసా దక్కుతుంది. ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీలు బలోపేతం కావాలి. వీటి పాత్ర రైతు ఆశించే స్థాయిలో లేదు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిర్వీర్యం అవుతోంది. గతంలో ఆర్థిక పరిపుష్టితో వ్యవసాయ మార్కెట్ కమిటీలు కళకళలాడేవి. ఉమ్మడి జిల్లాలో 14 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. గతంలో మాదిరిగా ఆదాయ వనరులు లేకుండా పోయాయి. గోదాములను వినియోగి స్తున్న పౌర సరఫరాల శాఖ,గృహ నిర్మాణ శాఖ అద్దెలు సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో మార్కెటింగ్ శాఖలో ఉద్యోగులు, ▶మిగతా 2లో..

ప్రణాళికాబద్ధంగా రాజమండ్రి అభివృద్ధి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, అఖిలపక్ష నేతలు

చిట్టూరి ప్రభాకర్ చౌదరి విగ్రహం ఏర్పాటు : ఎమ్మెల్యే హామీ

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రాజమండ్రి నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, అఖిలపక్ష నేతలు స్పష్టం చేసారు. శనివారం రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఛాంబర్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు అధ్యక్షతన 2027 పుష్కరాలపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. పుష్కరాలకు దేశంలోని అనేక ప్రాంతాల నుండి కోట్లాది మంది భక్తులు రాజమండ్రికి వస్తారని ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చెయ్యాలని వారు కోరారు. కోట్లాది మంది భక్తులతో పాటు స్థానిక ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు ▶మిగతా 2లో..

‘తల్లికి వందనం’పై ఆంక్షలు తగదు

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన తల్లికి వందనం పథకం చదువుకున్న పిల్లలందరికీ అమలు చేయలేకే ఆంక్షల కుట్ర అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా తల్లికి వందనం పథకాన్ని జూన్ 12వ తేదీన మంజూరు చేసిందని, ఈ పథకం చదువుకునే పిల్లలందరికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేకే ఆంక్షలు, కుట్రలు విధిస్తుందని అన్నారు. ఒక కుటుంబంలో ఎంతమంది ఉన్నా వారందరికీ పథకాలు అమలు చేస్తానని చెబుతూనే మరోపక్క విద్యుత్ యూనిట్‌లు 300 దాటిన వారికి పథకాలు లేవని, నెలసరి ఆదాయం 12,000 మించరాదని ▶మిగతా 2లో..

ముమ్మిడివరం సమస్యలు పరిష్కారమయ్యేనా?

నిధులు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రజల వినతి

విశాలాంధ్ర - కాట్రేనికోన : గత పాలకుల నిర్లక్ష్యం, అసమర్థత కారణంగా ముమ్మిడివరం నియోజకవర్గంలో అనేక సమస్యలు పేరుకు పోయాయి. అభివృద్ధి వాగ్దానాలకు, కాగితాలకే పరిమితమైందన్నది తెలిసిందే. ఎన్ని ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా తమ బ్రతుకులు మారడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజలు ఆశలు పెట్టుకున్న కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. ముమ్మిడివరం నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలు తీర్చాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా నియోజకవర్గంలో ఉన్నత విద్య, వైద్య సేవలు అందక పేద కుటుంబాలు పట్టణాలకు వెళ్లాల్సి రావడంతో అనేక ఇక్కట్లు పడుతున్నాయి. ఇక్కడ కనీసం ప్రభుత్వ డిగ్రీ కాలేజీనైనా ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ముమ్మిడివరం నియోజకవర్గ కేంద్రంలో ఇప్పటికీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మాత్రమే కొనసాగుతోంది. దాన్ని పూర్తిస్థాయి ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసే అధునాతన వైద్య సౌకర్యాలు, భవనాలు కల్పించాల్సి ఉంది. ముమ్మిడివరంలో మూతపడిన ఆర్టీసీ బస్టాండ్‌ను తిరిగి పునరుద్ధరించి ప్రయాణికుల అసౌకర్యం తొలగించాలని కోరుతున్నారు. ప్రకృతి అందాలకు నిలయమైన కాట్రేనికోన మండలంలోని చిర్ర యానం, లైట్ హౌస్ తీర ప్రాంతాలను మినీ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి కీ.శే. లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి కన్న కలలు నిజం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధానంగా నియోజకవర్గంలోని ఐలాండ్ చుట్టూ 323 కోట్ల రూపాయలతో ఏటిగట్లు పటిష్టపరిచి వాటిపై రోడ్లు నిర్మించేందుకు ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉన్న ప్రతిపాదనలకు నిధులు ▶మిగతా 4లో..

తల్లికి వందనంతో... ప్రతి ఇంట్లో పండుగ

మంత్రి రామానాయుడు

పాలకొల్లులో అభివృద్ధి పనుల పరిశీలన

విశాలాంధ్ర - పాలకొల్లు : రెండు రోజులుగా రాష్ట్రంలో ఏ ఇంట్లో చూసినా తల్లికి వందనం పండగ వాతావరణం కనిపిస్తుందని, పిల్లల తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు పట్ట ణంలో శరవేగంతో జరుగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను కూటమి నాయకులతో కలిసి మంత్రి రామానాయుడు శనివారం పరిశీలించారు. పనులపై అధికారు

లతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తల్లికి వందనం కింద 67లక్షల మంది చదువుకునే పిల్లలకు 10,651 కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ▶మిగతా 2లో..

అల్లం గోపాలరావు మృతి కళారంగానికి తీరని లోటు 4

ఏలూరు ఆటోనగర్ అభివృద్ధికి సహకరించండి 8

23 కేజీలు గంజాయి పట్టివేత : 4 వాహనాల సీజ్ 8

ముగిసిన బదిలీ కౌన్సిలింగ్

3,920 మంది ఉపాధ్యాయుల బదిలీ

విశాలాంధ్ర-ఏలూరు: మూడున్నర నెలల పాటు సుదీర్ఘంగా సాగిన ఉపాధ్యా యుల బదిలీ కౌన్సిలింగ్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 4975 మంది అన్ని కేడర్ల ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 3920 మందికి బదిలీలు జరిగాయి. క్యాడర్ల వారీగా చూస్తే... 450 మంది ప్రధానోపా ధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకోగా 320 మందికి బదిలీలు జరిగాయి. స్కూల్ అసిస్టెంట్లలో అన్ని సబ్జెక్టులకు సంబంధించి 2332 మంది దరఖాస్తు చేసుకోగా సుమారు 1600 మందికి బదిలీలు జరిగాయి. ఎస్‌జిటి లలో 22 25 మంది దరఖాస్తు చేసుకోగా సుమారు 2000 మందికి మాన్యువల్ కౌన్సిలింగ్‌ను నిర్వహించి వారు ఎంపిక చేసు కున్న పాఠశాలలను కేటాయించారు. ఉమ్మడి పశ్చిమగోదా వరి జిల్లాలో బదిలీలతో పాటు 106 మంది ఎస్ఏలు హెచ్ఎం లుగా పదోన్న తులు పొందారు. 229 మంది ఎస్ఏలు, ఎస్‌జిటిలు పిఎస్ హెచ్ఎంలుగా పదోన్నతులు పొందారు.

'తల్లికి వందనం' రూ.2వేలు కోత సరికాదు

విశాలాంధ్ర - పాలకొల్లు: తల్లికి వందనం పేరుతో రూ.2వేలు కోత విధించడం అన్యాయమని పాలకొల్లు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు అన్నారు. శనివారం వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో గుడాల గోపి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తానని ఎన్నికలకు ముందు బహిరంగంగా ప్రజలకు వాగ్దానం చేసిందని, ఇప్పుడు మాటతప్పి రూ.13వేలు మాత్రమే తల్లులకు ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. మిగిలిన 2వేలు ఎవరి జేబులోకి వెళ్లాయో లోకేష్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రకటించిన నిరుద్యోగ భృతి ఎక్కడని ప్రశ్నించారు. ఎప్పటి నుండి అమలు అవుతుందో చెప్పాలన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉంటూ, ప్రజల పక్షాన సమస్యలపై పోరాడుతామని తెలిపారు. కర్రా జయసరిత, జోగాడ ఉమామహేశ్వర రావు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పాఠశాలకు గ్యాస్ స్టవ్ బహూకరణ

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు మండల పరిధిలోని ఎంపీపీ కాపవరం నెంబర్ టు బేసిక్ ప్రైమరీ స్కూలుకు భవానీ ప్రసాద్ రాయపూడి సహకారంతో పాలకొల్లుకు చెందిన గాదె సుబ్బారావు సౌజన్యంతో పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం గ్యాస్ స్టవ్ ను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిమిత్తం గ్యాస్‌స్టవ్ పాఠశాలకు అందించినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థుల కోసం సన్న బియ్యం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. నాణ్యతతో కూడిన బ్యాగులు, బెల్టు, పుస్తకాలు అందిస్తున్నట్టు తెలిపారు. దాతల సహకారంతో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని, మంచి పౌరులుగా ఎదగాలని చెప్పారు. ఉత్తమ ఉపాధ్యాయుడు రాయపూడి భవానీ ప్రసాద్ పాఠశాలకు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. స్కూలుకు ఏ అవసరం వచ్చిన తనను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని వెల్ల బేబీ సరోజ, పి.ఎం.సి సభ్యులు ఎండిఎం నిర్వాహకులు తోట కుమారి, శానిటేషన్ ఆయా ఎం. ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-టి.నరసాపురం: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో జి. నగరాజ కుమారి తెలిపారు. మండలంలో శనివారం అన్ని పంచాయతీల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో యోగా కార్యక్రమం ప్రతి పంచాయతీలో ఒక మండల అధికారి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించి ప్రజలకు యోగా ఆవశ్యకత గురించి తెలియజేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోదుగు సునంద, డిప్యూటీ తహశీల్దార్ స్రవంతి, ఏఓ జి. మణి కుమారి,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు తగదు (1వ పేజీ తరువాయి)

కుంటిసాకులు చెబుతూ పథకాలు నిలుపుదల చేస్తున్నారని, విద్యార్థుల తల్లులు తల్లికి వందనం పథకం అమలుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని వారి ఆశలు అడియాసగా మిగిలాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఈ ప్రభుత్వం విధిస్తుందని, గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి పాలనలో ఏమాత్రం తేడా లేదని దొందు దొందేనని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధిగా చదువుకునే పిల్లలందరికీ పూర్తిస్థాయిలో పథకాలు అమలు చేయాలని, లేకుంటే మహిళల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన అన్నారు.

పండుగ

(1వ పేజీ తరువాయి)

పాఠశాలలు తెరిచిన మొదటి రోజున కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది పిల్లలకు, వారి తల్లులు ఖాతాలో జమ చేసామన్నారు. ఒకరు ఉంటే 13 వేలు, ఇద్దరు ఉంటే 26 వేలు, ముగ్గురు ఉంటే 39వేలు, నలుగురికి 52 వేలు, ఐదుగురికి 65 వేలు అందినట్లు చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద 20వేలు రైతులకు ఈ నెలలోనే అమలు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తూనే అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ముందుగా టిడ్కో గృహాలు, నర్సాపురం కాలువపై వంతెన, రేవులు, అంబేద్కర్ భవనం, గౌడ శెట్టిబలిజ భవనం, క్రిస్టియన్ స్మశాన వాటిక, ముస్లిం షాది ఖానా, ప్రభుత్వ ఆసుపత్రి, ఉద్యానవనాలు, ఎన్టీఆర్ కళాక్షేత్రం, హిందూ స్మశాన వాటిక తదితర అభివృద్ధి పనులను పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఏజెన్సీలకు మంత్రి రామానాయుడు ఆదేశాలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి పెచ్చెట్టి బాబు, టిడిపి జిల్లా నాయకులు కర్నేన గౌరు నాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షులు జివి, వల్లభు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రి అభివృద్ధి

(1వ పేజీ తరువాయి)

అందరి సలహాలు తీసుకుని రాజమండ్రి నగరాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గోదావరి గట్టుపై మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్టు నాయకుడు, కార్మికనేత చిట్టూరి ప్రభాకర్ చౌదరి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మధు మాట్లాడుతూ పుష్కరాల సమయంలో శానిటేషన్, మంచినీటి సరఫరా, అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు, వైద్యం, భక్తులకు కావలసిన కనీస సౌకర్యాలు, పార్కింగ్, రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్‌ల నుండి గోదావరి రేవులకు ప్రత్యేక వాహనాల ఏర్పాట్లు వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు.

మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపకల్పన చెయ్యాలన్నారు. వైఎస్ఆర్‌సీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మీ మాట్లాడుతూ గత పుష్కరాలలో జరిగిన తప్పిదాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చెయ్యాలన్నారు. బీజేపీ నాయకులు కంటిపూడి సర్వారాయుడు మాట్లాడుతూ గోదావరి రేవులకు మార్గాలకు దారులు చూపే బోర్డులు ఏర్పాటు చెయ్యాలన్నారు. ఆర్డీవో కృష్ణ నాయక్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలలో అన్ని వర్గాల ఆలోచనలు, అన్ని రాజకీయ పార్టీల సలహాలు స్వీకరిస్తామన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ పారిశుధ్య పరంగా ఇబ్బందులు లేకుండా శాశ్వత చర్యలు చేపడతామన్నారు.

జిల్లా ఎస్పీ సుబ్బరాజు మాట్లాడుతూ భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారని, మాజీ సైనికులు , విశ్రాంత పోలీసుల సేవలు తీసుకుంటామన్నారు.

ఛాంబర్ అధ్యక్షులు తవ్వా రాజా మాట్లాడుతూ 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు వ్యాపారులకు నష్టం కలగకుండా చూడాలన్నారు.

ఈసమావేశంలో సీపీఎం నాయకుడు టి.అరుణ్, రుడా మాజీ చైర్మన్ షర్మిలారెడ్డి, సీనియర్ పాత్రికేయుడు వీవీ కృష్ణకుమార్,జనసేన నాయకుడు వై .శ్రీను, మాజీ కార్పొరేటర్లు వర్రే శ్రీను, పాలసానపల్లి హనుమంతరావు, కొల్లేపల్లి శేషయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు టికె విశ్వేశరరెడ్డి తదితరులు మాట్లాడారు.

సహకారమేది?

(1వ పేజీ తరువాయి)

సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. గత ప్రభుత్వ హయాంలో మార్కెటింగ్ శాఖకు ఆదాయం సమకూరేది.

గోదాముల అద్దె రూపంలో మరికొంత ఆదాయం వచ్చింది. కానీ వ్యవసాయ అనుబంధ రంగాలకు కనీసం ఖర్చు చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించింది. గతంలో మాదిరిగా వ్యవసాయ అనుబంధ రంగాలకు మార్కెటింగ్ శాఖ నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పశు వైద్య శిబిరాలు విరివిగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సహకారం సున్నా...

జిల్లాలో సహకార సంఘాల పరిస్థితి కూడా భిన్నంగా ఏమీ లేదు.ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నా... జిల్లాలో ఆ ఆనవాళ్లు కనిపించడం లేదు. పైగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతు సేవ కంటే వాణిజ్య ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి.రైతులు పండించే పంటలను ధర వచ్చేవరకు నిల్వ చేయడం వీటి ప్రధాన విధి. కానీ అటువంటివేమీ జిల్లాలో అమలు కావడం లేదు.

చాలాచోట్ల గోదాముల నిర్మాణం జరుగుతోంది. ఎక్కడా పూర్తయిన దాఖలాలు లేవు. దీనికి తోడు గత ఐదేళ్లుగా రైతు భరోసా కేంద్రాల పేరు చెప్పి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సేవా సంఘాల సేవలను పూర్తిగా తొక్కిపట్టారు. కూటమి ప్రభుత్వం పైనే జిల్లా రైతులు ఆశలు పెట్టుకున్నారు.

పశువైద్యశిబిరాలు నిర్వహించాలి

ఏడాది పొడవుగా వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించాలి.

పాత రోజులలో రైతులకు ప్రయోజనం కలిగించే అనేక పనులు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.పశు వైద్య శిబిరాలు అన్న మాటే మరిచిపోయారు. రైతు సేవలకు ఏఎంసీలు దూరంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి.

పి.ఎ.సి.ఎస్. సేవలేవి?

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పి.ఎ.సి.ఎస్.లు) ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు భరోసా కేంద్రాలకు బదలాయించారు.అక్కడా అరకొరగానే అందేవి. పి.ఎ.సి. ఎస్.లను బలోపేతం చేసి వాటి ద్వారా రైతులకు అవసరమైన సౌకర్యాలు అందించాలి.

పేదల సంక్షేమమే టీడీపీ అజెండా

విశాలాంధ్ర -నూజివీడు : తల్లికి వందనం పథకంలో భాగంగా కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి తెలుగుదేశం ప్రభుత్వం ప్రతి ఒక్కరికి తల్లికి వందనం పథకం మంజూరు చేసిందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎందరు పిల్లలు ఉన్న అమ్మఒడి పథకం ద్వారా ప్రతి విద్యార్థికి న్యాయం చేస్తామని చెప్పి కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అమ్మఒడి పథకం వర్తింపజేశారని అన్నారు. వైసీపీ ప్రభు త్వంలో 42 లక్షల మందికి మాత్రమే అమ్మఒడి పథకం వర్తింపజేశారని, ఇప్పుడు తల్లికి వందనం పథకం ద్వారా దాదాపు 65 లక్షల మందికి ఈ పథకం ద్వారా న్యాయం చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో విద్యార్థులతో మంత్రి ముచ్చటించారు. ఆగస్టు 15 తేదీన ఉచిత బసు అమలు చేయనున్నామన్నారు.

యోగ ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలి

విశాలాంధ్ర-లింగపాలెం: యోగ ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలని అధికారులు తెలిపారు. యోగపై అవగాహన కల్పిస్తూ లింగపాలెం మండలంలోని సచివాలయాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యోగ కార్యక్రమాలపై ప్రజలు స్పందించి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగులు,రాజకీయ నాయకులు, సామాన్య ప్రజలు పెద్ద సంఖ్యలో మహిళలు యోగ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఎంపీడీవో వాణి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగబాబు, యోగ రిసోర్స్ పర్సన్స్ గ్రామాలలోఈ కార్యక్రమాలు నిర్వహించారు. యోగ ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగాతో మంచి ఆరోగ్యం

విశాలాంధ్ర-కాళ్ళ : మన ఆరోగ్యం మనమే కాపాడుకోవాలని దానికి యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని శాసనసభ్యులు డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురాం కృష్ణంరాజు అన్నారు. పెద్ద అమిరం రాధాకృష్ణ ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తో కలిసి ఏర్పాటుచేసిన యోగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి జీవితంలో అవసరమని, ఒత్తిడి, శరీర, మానసిక ప్రశాంతత కలుగ చేస్తుందని ఈనెల 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే యోగ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు రిజిస్ట్రేషన్ చేయించుకుని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొక్కు సోమేశ్వరరావు, జుత్తుగ నాగరాజు, అధికారులు మహిళలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు బ్యాంకు మహాజనసభ

విశాలాంధ్ర-ఏలూరు: ద ఏలూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ (టెకు బ్యాంకు), అగ్రహారం బ్రాంచ్ మహాజనసభ ఆదివారం స్థానిక వై ఎం హెచ్ ఏ హాలులో జరుగుతుందని బ్యాంక్ చైర్మన్ ఏ.వి. అంబికా ప్రసాద్, డైరెక్టర్ కారం శెట్టి రమేష్ బాబు లు తెలిపారు. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పరిపాలన నివేదిక, ఆర్థిక నివేదిక, బడ్జెట్ ఆమోదం, ఆడిటర్ నియామకం తదితర అంశాలను మహాజనసభలో చర్చించనున్నట్టు వారు తెలిపారు . ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే మహాజన సభకు సభ్యులు సకాలంలో హాజరుకావాలని వారు కోరారు.

సెల్‌ఫోన్ చోరీలతో ప్రజల బెంబేలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వరుస సెల్ ఫోన్ చోరీలతో కొయ్యలగూడెం పట్టణ ప్రజలు, ప్రయాణికులు బెంబేలెత్తు తున్నారు. కొయ్యలగూడెం ఆర్టీసీ బస్టాండ్ లో సెల్‌ఫోన్ దొంగతనాలు మళ్లీ మొదటికి వచ్చాయి. గత సంవత్సర కాలం క్రితం ఆర్టీసీ బస్టాండ్ లో, మండలంలో పలు గ్రామాలలో సెల్‌ఫోన్ చోరీలు ఎక్కువగా జరిగాయి. తరువాత పోలీస్ నిఘా ఎక్కువగా ఉండటం వలన చోరీలు తగ్గాయి. మరల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రతిరోజు సెల్‌ఫోన్లు పోగొట్టుకొని అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ కు గ్రామానికి చెందిన కొంతమంది చరవాణి ద్వారా ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్‌ఫోన్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సీసీ కెమెరాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కోరారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త వాసం ప్రసాద్ రావు జంగారెడ్డిగూడెం వెళ్లటానికి కొయ్యలగూడెం ఆర్టిసి బస్టాండ్ లో కొవ్వూరు డిపోకు చెందిన బస్సు ఎక్కగా తన చొక్కా పై జేబులో ఉన్న సెల్ ఫోన్‌ను దొంగిలించడం జరిగింది. తన సెల్ ఫోన్ దొంగిలించారని పోలీస్ స్టేషన్ ఎదురుగా బస్సు నిలుపుదల చేసి తనిఖీ నిర్వహించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. ఇలా సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు అనేకులు ఉన్నారు. సంబంధిత అధికారులు సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమాజానికి సేవ లయన్స్‌క్లబ్ లక్ష్యం

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర-ఏలూరు: సమాజానికి సేవలు ఎల్లప్పుడూ అవసరం ఉంటుందని, దానిని గుర్తించి ఆ సేవలను అందించడమే లయన్స్ క్లబ్‌ల పాత్ర అని శాసన మండలి సభ్యులు,లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ వంక రవీంద్రనాథ్ అన్నారు. శనివారం స్థానిక గ్రీన్ సిటీ లయన్స్ జిల్లా సేవా సంఘ భవనంలో జరిగిన ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌ల ద్వారా చేయవలసిన సామాజిక కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. 100 సంవత్సరాల లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సంస్థ ముందు చూపుతో వచ్చే అనర్థాలను పసిగట్టి సమాజాన్ని మేలుకొల్పుతుందని రవీంద్రనాథ్ అన్నారు. పర్యావరణం కాలుష్యం, ఎలక్ట్రానిక్ వ్యర్థాల కాలుష్యం, షుగర్ వ్యాధి, పిల్లల్లో అంధత్వం వంటి ఎన్నో సమస్యలు ముందుగా హెచ్చరిస్తూ, అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ను ప్రపంచ వ్యాప్తంగా చేస్తుందన్నారు. తొలుత నూతన కార్యవర్గాన్ని మాజీ మునిసిపల్ చైర్మన్,లయన్స్ జిల్లా నాయకులు వంక రాజకుమారి ప్రమాణ స్వీకారం చేయించి, వారి బాధ్యతల్ని వివరించారు. ముగ్గురు నూతన సభ్యులను లయన్స్ జిల్లా నాయకులు సిహెచ్. అవినాష్ రాజు, ఇండక్షన్ చేశారు. క్లబ్ నూతన అధ్యక్షులుగా వి. వెంకట నాగలక్ష్మి, కార్యదర్శిగా శ్యామలాపల్లి సుజాత, కోశాధికారిగా మహ్మద్ ముంతాజ్ బేగం ప్రమాణం చేశారు.జిల్లా నాయకులు చుక్కా పావని వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

గోపాలరావు మృతికి ప్రజానాట్యమండలి సంతాపం

విశాలాంధ్ర- కామవరపుకోట: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పూర్వ కార్యదర్శి, సినీ, బుల్లితెర నటుడు అల్లం గోపాలరావు మృతికి ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు, ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షులు సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు శనివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. అల్లం గోపాలరావు యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శిగా, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శిగా, పనిచేశారని పేర్కొన్నారు. జానపద గీతాలు యువ కళాకారులకు శిక్షణ ఇవ్వడానికి కామవరపుకోట చింతలపూడి ఏలూరు తదితర ప్రాంతాల్లో శిక్షణ శిబిరం నిర్వహించినప్పుడు ఆయన ఎంతో ఓర్పుతో యువతీ యువకులకు ఆటపాటలు నేర్పించి ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం హైదరాబాదులో స్థిరపడి బుల్లితెర, వెండి తెరపై కనిపించారని కొనియాడారు. ఆయన మృతికి బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ,బొమ్మ నందకుమార్, కంకిపాటి ఏసు పాదం, తదితరులు గోపాలరావుకు సంతాపం తెలిపారు.

రవికుమార్ మృతి ప్రజా సంఘాల ఉద్యమానికి తీరనిలోటు

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -నరసాపురం : ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కోశాధికారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రావి రవికుమార్ మృతికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శనివారం చిట్టవరంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. సీతారాం ప్రసాద్‌తో కలసి రవికుమార్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ రవికుమార్ విద్యార్థి దశనుంచి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారన్నారు. విద్యార్థులెదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ జరిగిన అనేక ఉద్యమాలు, పోరాటాల్లో ఎంతో నిబద్ధత, అంకితభావంతో పనిచేశారన్నారు.

ఆర్టీసీ సంస్థలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగ, కార్మిక సమ స్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన అనేక పోరాటాల్లో తన వంతు క్రియాశీలక పాత్ర నిర్వహించా రన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నరసాపురం డిపో కార్యదర్శిగా, జిల్లా కోశాధికారిగా ఉద్యోగ,కార్మిక సమస్యలు పరిష్కారానికి ఎనలేని కృషి చేసిన రవికుమార్ మృతి తీర్చలేనిదంటూ నివాళులర్పించారు. సీపీఐ

రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బా రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు నెక్కంటి క్రాంతికుమార్ తదితరులు రవికుమార్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంతో భవిష్యత్ వున్న రవికుమార్ చిన్న వయసులోనే మరణించడం బాధాకరమన్నారు. రవికుమార్ మృతికి సంతాపం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య ప్రదాయిని యోగా

కలెక్టర్ కె.వెట్రిసెల్వి
18న బౌద్ధారామంలో యోగాంధ్ర

విశాలాంధ్ర-ఏలూరు: ఆమె ఒక జిల్లా కలెక్టర్... నిత్యం పరిపాలనలో బిజీ.కానీ ఒక సామాన్యురాలు మాదిరిగా అందరిలో కలిసి పోతారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్ర మాల్లోనే కాదు..స్వయంగా కూడా ఆమెకు ప్రతి రోజూ యోగా చేయడం అలవాటు. యోగా..ఏదో మొక్కుబడిగా చేయకండి. ఆరోగ్యాన్ని కాపాడుకోవా లంటే ఇష్టంతో చేయండి. నిత్యం ఎన్నో ఒత్తిడుల మధ్య జీవిస్తుంటాం. వాటిని అధిగమించా లంటే యోగా తప్పనిసరి అంటూ ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. పిలుపునివ్వడమే కాదు.. స్వయంగా ఆమె యోగా చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ గా విధుల్లో ఎంత బిజీగా వున్నా.. మరెన్నో పనులు.. కానీ యోగా చేయడం మాత్రం మానరు. ఆమె చేస్తూ ఇతరులు కూడా యోగా చేసేలా మార్గదర్శకులుగా నిలుస్తు న్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శనివారం ఏలూరు, వట్లూరులోని టిటిడిసిలో సన్నద్ధక సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ

కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వితో పాటు పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు .జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేం దుకు ఇంతవరకు 8,50,189 మంది పౌరులు యోగాంధ్ర యాప్ లో నమోదయ్యా రన్నారు. పర్యాటక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న యోగ అభ్యసన కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 18వ తేదీన కామవరపు కోట మండలం, గుంటుపల్లి బౌద్ధారా మంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు,డిఆర్ డి ఏ పిడి డాక్టర్ ఆర్. విజయరాజు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఆయుష్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

అల్లం గోపాలరావు మృతి కళారంగానికి, వామపక్షాలకు తీరని లోటు

విశాలాంధ్ర -చింతలపూడి: అల్లం గోపాల రావు మృతి కళారంగానికి, వామపక్షాలకు తీరని లోటు అని సీపీఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు అన్నారు. అల్లం గోపాలరావు సంతాప సభ టీవీఎస్ రాజు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వసంత రావు మాట్లాడుతూ గోపాలరావు యువజన సమాఖ్యలో పని చేశారని తర్వాత ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడిగా పని చేశారని తెలిపారు. 1983లో మక్కిన వారి గూడెంలో ప్రజానాట్యమండలి శిక్షణ శిబిరంలో తొలి పరిచయంగా ఏర్పడి టీవీ కళాకారుడిగా చలనచిత్ర కళాకారుడుగా సినీ నటులు బ్రహ్మానందానికి పర్సనల్ సెక్రెటరీగా జీవితంలో ఒక స్థానానికి ఎదిగాడని అన్నారు. ఆయన ఆకస్మికంగా మృతి చెందటం చాలా బాధాకరమన్నారు. రేలారే రేలా అనే పాటతో ఆనాడు ఉర్రూతలూగించిన ప్రజా కళాకారుడు గోపాలరావు అన్నారు. సంతాప

సభలో అరసం రాష్ట్ర కార్యదర్శి బి ఎన్ సాగర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, సహాయ కార్యదర్శి దొంత కృష్ణ, మండల కమిటీ సభ్యులు పుల్లూరి సోమశేఖర్, ప్రజానాట్యమండలి కళాకారులు అలెగ్జాండర్, లాజరు, ఎస్కే మస్తాన్, ఎస్. లెనిన్ బాబు, కే ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

కొలతలు సరే... ఆక్రమణల తొలగింపు ఎప్పుడు?

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మండల కేంద్రమైన కొయ్యల గూడెం పట్టణంలో కన్నాపురం రోడ్డులోని దుకాణదారులు రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని వ్యాపారాలు కొనసాగించడంతో రహదారిపై ప్రయాణించాలంటే ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటం వలన పాదచారులు, వాహన చోదకులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధాన జాతీయ రహదారిని ఆనుకుని సురక్ష హాస్పిటల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణదారులు ప్రభుత్వ భూమిలో కట్టడాలు కట్టడం వలన రహదారి ఇరుకుగా తయారైంది, బుధవారం వచ్చిందంటే మార్కెట్ జరిగే సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యపై వినియోగదారుల రాష్ట్ర ఉపాధ్యక్షులు హనుమంతరావు కలెక్టర్‌కు ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు చేయడంతో, ఆర్అండ్‌బి అధికారులు, రెవెన్యూ అధికారులు, పది రోజుల క్రితం రహదారిని సర్వే చేసి 60 అడుగుల వెడల్పు కొలతలు వేసి మార్కింగ్ ఇచ్చారు. ఆక్రమణలు ఎప్పుడు తొలగిస్తారు అని పంచాయతీ కార్యదర్శి సురేష్‌ను వివరణ కోరగా ఆర్ అండ్ బి అధికారులు కొంతమంది పేర్లను తమకు పంపించారని, త్వరలోనే దుకాణదారులకు నోటీసులు అందజేసి ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపుతామని ఆయన పేర్కొన్నారు.

సమాజంలో పఠనాశక్తి పెంపొందాలి

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర-ఏలూరు: సమాజంలో పఠనాసక్తిని పెంపొందిం చడం, పుస్తకాల ద్వారా జ్ఞానాన్ని విస్తరించడం లక్ష్యంగా ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో "ఏలూరు బుక్ నూక్స్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుస్తక ప్రియు లతో బాటు, కొత్త వారిలో కూడా పఠనా సక్తిని కలిగిం చేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించనున్నట్లు ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఏలూరు బుక్ నూక్స్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు నూతన పుస్తక సేకరణ కార్యక్రమంతో బాటు, సరికొత్త వెబ్సైట్‌ను శనివారం ఆవిష్కరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తుతమున్న మూడు కేంద్రాలకుగాను భవిష్యత్తులో 100 పుస్తక కేంద్రాలకు విస్తరించేందుకు ఏర్పాట్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్ర మానికి నగదు రూపంలో ఎలాంటి విరాళాలు స్వీకరించబోమని స్పష్టం చేశారు. కేవలం పుస్తక రూపంలో మాత్రమే విరాళాలను స్వీకరిస్తారని వివరించారు. ఈ పుస్తకాలు ఏలూరు , పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేయబోయే నూతన బుక్ నూక్స్ ద్వారా వేలాది మంది పాఠకులకు అందుబాటు లోకి వస్తాయి. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పుస్తకాలను సమర్పించడం ద్వారా భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

డాక్టర్ బోస్‌కు 'మేజిక్ ఆచార్య' బిరుదు ప్రదానం

విశాలాంధ్ర -భీమవరం: మేజిక్ రంగంలో విశేషమైన కృషి చేసి, విశిష్ట సేవలను అందించిన బహుముఖ ప్రజ్ఞావంతుడు మేజిక్ స్టార్ బోస్ అని ఆయుర్వేద జ్యోతి మాసపత్రిక ఎడిటర్ దుర్గేష్ అన్నారు. ఆయుర్వేద జ్యోతి మాస పత్రిక 9వ వార్షికోత్సవం సంద ర్భంగా ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ డాక్టర్ బోస్‌ను 'మేజిక్ ఆచార్య' బిరుదు, అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మందికి ఇంద్రజాలం నేర్పి, వారిని మెజీషియన్లుగా తీర్చిదిద్ది, మేజిక్ రంగాన్ని సరి కొత్త మలుపు తిప్పి, ఆ రంగంలో విప్లవాన్ని సృష్టించిన మహనీయుడు బోస్ అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ బాబ్జీ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు, చెరుకువాడ రంగసాయి, గుంటూరు రామరాజు తదితరులు బోస్‌ను సత్కరించారు.



పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య

విశాలాంధ్ర - కుక్కునూరు : విలీన మండలాలు కుక్కునూరు, వేలేరుపాడు ఏజెన్సీ ప్రాంతంలో అనాదిగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు.శనివారం కుక్కునూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి కృష్ణకుమారికి విజ్ఞాపన పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ. మునీర్,జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య,సీపీఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, వేలేరుపాడు మండల సమితి కార్యదర్శి బాడిస రాము, కూరాకుల బాబూరావు, పిట్టా ప్రసాద్, మడివి కామయ్య, కురిమెల్ల వెంకటేశ్వరావు, బంధం నాగేశ్వరరావు, సోడే ప్రసాద్, కరాటం పాపారావు, సోడే నాగేష్, మారయ్య పాల్గొన్నారు.

సబ్సిడీ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - నరసాపురం: రైతులకు సబ్సిడీ పై అందించే యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని లక్ష్మనేశ్వరంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు ఈదా అనిల్ కుమారి ఆధ్వర్యంలో శని వారం నిర్వహించిన ఏరువాక పౌర్ణమి, సబ్సిడీ పై వ్యవసాయ పనిముట్లు

పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి ఏరువాక పౌర్ణమి ప్రాముఖ్యత తెలియజేశారు. ఏరువాక పౌర్ణమి రైతులకు సంబంధించిన అతి పెద్ద పండుగ అని తొలకరి జల్లుల ఆగమనంలో రైతులు ఆనందోత్సాహాల మధ్య అరక దున్నడం మొదలు పెడతారని దీన్ని రైతులు సాంప్రదాయబద్ధంగా జరుపుకుంటారని తెలియజేశారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని వివిధ గ్రామాలలో రైతులకు రాయితీపై కృషి ట్రాక్టర్లు, రోటావెటరులు,లెవెలింగ్ బ్లేడ్‌లు,పవర్ స్ప్రేయర్లు బ్యాటరీ ప్రేయర్లు 33 మందికి గాను రూ.14 లక్షల 32వేల 810 విలువగల వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు సబ్సిడీపై రైతులకు అందజేసారు. ప్రభుత్వ సలహాదారు, శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, జిల్లా నీటి సంఘం ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ గుబ్బల మారాజు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర- పాలకోడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీవో వి. రెడ్డయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు కనీసం 20 నిమిషాలు యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత

లభిస్తుందని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. ఎంతో ఉపయోగకరమైన యోగాను ప్రజలందరికీ చేరువ కావాలన్న సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాయని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆయనతోపాటు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అల్లం గోపాలరావు మృతి కళా రంగానికి తీరని లోటు

విశాలాంధ్ర -భీమవరం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అల్లం గోపాలరావు మృతి సాంస్కృతిక రంగానికి తీరనిలోటని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన అల్లం గోపాలరావు చిన్ననాటి నుండి కళా రంగంపై మక్కువతోఎన్నో నాటకాలు ప్రదర్శించారని తెలిపారు. భీమడోలు షుగర్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఎందరో యువతీ యువకులకు నాటకాలు, నాటికలు, పాటలు నేర్పి నాటక పరిషత్తులకు పంపడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. వాకాడ రాజారావు శర్మ, నారాయణరావు, సినీ హాస్యనటులు బ్రహ్మానందం మంచి మిత్రులని వీరి ద్వారా గోపాలరావు ప్రజానాట్యమండలి లోకి ఆకర్షించబడ్డారని సీతారాం ప్రసాద్ అన్నారు. గోపాలరావు హేతువాద ఉద్యమంలో క్రియాశీలకంగా ఉండేవారని, అప్పటి హేతువాద ఉద్యమ నాయకులు కటారి ప్రభాకర్ రావు, ఝాన్సీ లక్ష్మి, ఇంకా అనేకమంది మిత్రులతో కలిసిమెలిసి ఉండి ప్రజల్లో చైతన్యం తేవడానికి కృషి చేశారని అన్నారు. స్వతహాగా గోపాలరావు కళాకారుడుగా ఉంటూ గ్రామంలో భూ భాగోతం, రాజకీయ భాగోతం ,పల్లె సుద్దులు ,పద్మవ్యూహం వంటి నృత్య నాటికలు తయారుచేసి ఎన్నో ప్రదర్శనలు ఇప్పించారని, ఆస్తి మూలపంజరాలు అనే పాటను గోపాలరావు పాడుతుంటే ఎంతో విన సొంపుగా ఉండేదని, అజాతశత్రువని కొనియాడారు. సినిమా రంగంలోకి హైదరాబాద్ వెళ్లి హాస్యనటుడు బ్రహ్మానందంకు పర్సనల్ అసిస్టెంట్‌గా ఉన్నారని పేర్కొన్నారు. గోపాలరావు మృతికి నాయకులు అద్దాల సత్యనారాయణ, లాల్, ఎ.నాగేశ్వరరావు, చాంద్ బాషా, తిరుమాని కామేశ్వరరావు, తిరుమాని చంటిరాజు ,సిహెచ్ నాగేశ్వరరావు, డివిఎన్ హనుమంతరావు, గిద్ద సూర్యనారాయణ తదితరులు సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

యోగాతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుదల

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని ద్వారకా తిరుమల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో స్థానిక ఎంపీడీవో రాజ మనోహర్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి అధ్యక్షతన అధికారులు, విద్యార్థినులు పలు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగా క్రమం తప్పకుండా చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతుందని అన్నారు. బెజవాడ రాణి మాట్లాడుతూ యోగ సాధనతో, ధ్యానంతో మన పూర్వీకులు అద్భుతమైన ఫలితాలు సాధించారని చెప్పారు. ధ్యానం ద్వారా మనం ఆత్మ పరిశీలన చేసుకుని మన బలాలు, బలహీనతలను తెలుసుకోవడమే కాకుండా వాటిని సరిదిద్దుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎవి సుబ్బరాయన్, పాఠశాల పీడీ శ్రీలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, కె.లక్ష్మీ సృజన, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారమయ్యేనా?

(1వ పేజీ తరువాయి)

విడుదల చేయాలని నియోజకవర్గ ప్రజలు ముఖ్యమంత్రికి వినతి చేస్తున్నారు. లంక ఆఫ్ తానేలంక వివేకానంద వారధి వద్ద గ్రోయన్స్ నిర్మాణానికి రూ.18 కోట్లతో చేసిన అంచనాలకు నిధులు ఇవ్వాల్సి ఉంది. గౌతమీ గోదావరి తీరంలోని కునాయిలంక, గురజాపులంక, సలాదివారిపాలెం, మురమళ్ళ ప్రాంతాల్లో 230 కోట్ల రూపాయలతో ప్రతిపాదించిన గ్రోయన్స్ నిర్మించి ఆస్థి, ప్రాణాలను కాపాడాలని పరిసర గ్రామాల ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబును వేడుకుంటున్నారు. పల్లం, భైరవపాలెం, మొల్లేటి మొగ, బలుసుతిప్ప తీర గ్రామాల్లో శిథిలస్థితిలో ఉన్న వారధిల స్థానే భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా కొత్త వారధిలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటి కార్యాచరణకు ఇప్పటికే రూ.40 కోట్లతో అంచనాలు రూపొందించగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. 72 కోట్లతో మూలపాలెం బ్రిడ్జి,44 కోట్లతో గోగుల్లంక గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉంది.కుండలేశ్వరం వద్ద కుంగిన ఏటి గట్టును వెంటనే యుద్ధ ప్రాతిపదికన ప్రతిష్ట పరిచి పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించవలసిన అవసరం ఎంతైనా ఉంది. యానాం నుండి జొన్నాడ ఎన్‌హెచ్ రోడ్డు వరకు ఏటిగట్టు వెడల్పు చేసి ఆధునీకరించాలని ప్రజల కోరుతున్నారు. ప్రధానంగా గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచిన కాట్రేనికోన-వయా అయినాపురం-ముమ్మిడివరం ఆర్ అండ్ బి రోడ్డును వెంటనే ఆధునీకరించాలని నియోజకవర్గ ప్రజలు ముక్తకంఠంతో సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రోడ్డు పూర్తిగా గోతులమయంతో చెరువులా మారి కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ పోలవరం మండలాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జి. వేమవరం టు గొర్రిపూడి ఆర్ అండ్ బి రోడ్డును ఆధునీకరించాలని కోరుతున్నారు. సముద్ర తీర మండలంలోని కాట్రేనికోన పీహెచ్‌సీని అభివృద్ధి చేసి వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని మత్స్యకారులు కోరుతున్నారు. 2014-19 సంవత్సరాల మధ్య ప్రభుత్వ పక్కా గృహాలు నిర్మించుకున్న పేద వర్గాలకు బిల్లులు చెల్లించి ఆదుకోవాలని, వివిధఅభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని బాధితులు కోరుతున్నారు. నియోజవర్గంలో రైతులకు ఎంతగానో ఉపయోగపడే పుంతలు, కాలువ గట్లు పై రోడ్ల నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఎన్ఆర్‌జిఎస్ నిధులను మంజూరు చేయాలని కోరుతున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గాన్ని సమస్యలు లేని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే పలు అభివృద్ధి, సంక్షేమప్రణాళికలను సిద్ధం చేసుకుని అవిరళ కృషి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజుకు ప్రోత్సాహ మిచ్చి పనులు కార్యరూపం దాల్చేలా సత్వరమే ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని నియోజకవర్గ ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

అల్లం గోపాలరావు మృతికి కోనాల సంతాపం

విశాలాంధ్ర -భీమవరం: సినీ నటుడు అల్లం గోపాలరావు మృతికి సీపీఐ జిల్లా సమితి తీవ్ర సంతాపం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ గోపాలరావు తొలినాళ్ళలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్యమండలిలో ప్రముఖ పాత్ర నిర్వహించారన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన గోపాలరావు సమాజంలో మంచి మార్పునకు ఎనలేని కృషి చేశారని తెలిపారు. సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు, సమాజంలో చైతన్యం నింపేందుకు ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి తనవంతు కృషి నిర్వహించిన గొప్ప అభ్యుదయవాది గోపాలరావు అన్నారు. గోపాలరావు మృతి సమా జానికి తీరనిలోటుగా పేర్కొంటూ భీమారావు నివాళులర్పించారు.

పశ్చిమకు రెడ్ క్రాస్ పురస్కారం

విశాలాంధ్ర -భీమవరం: భారత రెడ్‌క్రాస్ సొసైటీ పశ్చిమ గోదావరి జిల్లా శాఖ రాష్ట్రంలో కార్పొరేషన్‌లకు చెందిన విభాగంలో, అత్యధిక రక్త యూనిట్లు సేకరించిన సంస్థగా రెండవ స్థానం సాధించింది. గుంటూరులో భారతీయ విద్యాభవన్‌లో శనివారం జరిగిన ప్రపంచ రక్తదాతల దినోత్సవ రాష్ట్ర ఉత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖా మంత్రి

సత్యకుమార్ యాదవ్ చేతులు మీదుగా రెడ్ క్రాస్ జిల్లా శాఖాధ్యక్షులు డాక్టర్ రాంభద్రి రాజు అవార్డు స్వీకరించారు. రాష్ట్రస్థాయి పురస్కారం తణుకు రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌కి లభించడం విశేష గర్వకారణమని పలువురు వక్తలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్‌క్రాస్ శాఖ అధ్యక్షుడు వై.డి. రామారావు, రాష్ట్ర కార్యదర్శి, రిటైర్డు ఐఏఎస్ అధికారి ఎ.కె. ఫరీదా, రాష్ట్ర కోశాధికారి పి.ఆర్.సి. రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సత్కారం

విశాలాంధ్ర -భీమవరం: ఒక యూనిట్ రక్తం ముగ్గురు జీవితాలను కాపాడుతుందని, రక్తదానం అనేది ఒక స్వచ్ఛంద చర్య అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 64 సార్లుకుపైగా రక్తదానం చేసిన 5 గురు రక్తదాతలను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేయడం ప్రాణాలను కాపాడటమేనని, రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయనే అపోహలు వీడాలన్నారు. 18 ఏళ్ళ నుండి 55ఏళ్ల లోపు ఎవరైనా రక్తదానం చేయవచ్చునని, మన భీమవరంలో ఎందరో 60 సార్లు కు పైగా రక్తదానం చేయడం గొప్ప విశేషమని వారిని ఎమ్మెల్యే అంజిబాబు అభినందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రక్తాన్ని తీసుకొనే వ్యక్తిని గ్రహీత అని, ఇచ్చే వ్యక్తిని దాత అని అంటారని, రక్తదాతలు బోడపాటి పెదబాబు 64 సార్లు, కొప్పినిడి బాబీ 63 సార్లు, కెవిఎల్ నరసింహారావు 43 సార్లు, చల్లా రాము 25 సార్లు, చీడే చందు వలంటరీ క్యాంపులు నిర్వహించారని అన్నారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో వబిలిశెట్టి రామకృష్ణ, విజయలక్ష్మి, యర్రంశెట్టి శివకృష్ణ, నల్లం చిట్టిబాబు తదితరుకు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన చిన్న వెంకన్న ఆలయం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించి తరించారు. తెల్లవారు జాము నుంచే శ్రీవారి దర్శన క్యూలు, కేశఖండనశాల భక్తులతో కిటకిటలాడాయి. శ్రీవారి ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం క్యూలు, ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. సామాన్య భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 3గంటల సమయం పట్టింది. శ్రీవారి క్యూకాంప్లెక్స్‌లో వేచియున్న భక్తులకు ఆలయ అధికారులు అల్పాహారం. చిన్నారులకు పాలు అందజేశారు. దివ్యాంగులు, వృద్ధులు, చంటి బిడ్డ తలులను ప్రత్యేక క్యూలు ద్వారా దర్శనానికి అనుమతించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

కనీస వేతన చెక్కుల అందజేత

విశాలాంధ్ర – ఆత్రేయపురం : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో విధులు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులకు ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా వారి కనీస వేతనాన్ని రూ.20వేల నుంచి రూ.25 వేలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచింది. వాడపల్లి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణులకు శుక్రవారం ఎమ్మెల్యే తన చేతుల మీదుగా పెరిగిన వేతన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాధం, మండల టిడిపి అధ్యక్షులు కె రామకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలి

విశాలాంధ్ర – ఆలమూరు : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలని అగ్రికల్చర్ ఏవోలక్ష్మీలావణ్య అన్నారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆలమూరు మండలంలోని మొత్తం 6093 మంది సొంత భూమి కలిగిన రైతులు ఉన్నారని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు ఆర్థికసాయం అందించే విధంగా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తుందని వివరించారు. ఈ నెల 20వ తేదీ లోపు ప్రతి రైతు వారి పరిధిలో ఉన్న రైతు సేవ కేంద్రాలను సందర్శించి అన్నదాత సుఖీ భవ పోర్టల్ నందు ఈ కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని ఆమె తెలిపారు. అందుబాటులో లేని రైతులు ఎవరైనా ఉంటే రాష్ట్రంలో ఎక్కడైనా రైతు సేవా కేంద్రాలలో ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చన్నారు.

మహిళను రక్షించిన సీఐ విద్యాసాగర్

విశాలాంధ్ర– రావులపాలెం : కాకినాడ జిల్లా బిక్కవోలు మండలానికి చెందిన పలివెల శైలజ, భర్త పేరు రాజు, వయస్సు సుమారు 30, ఆమె తన కుటుంబ కలహాల దృష్ట్యా ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో జొన్నాడ బ్రిడ్జ్ పైనుండి దూకే ప్రయత్నం చేయబోగా అదే సమయంలో అటుగా వెళ్తున్న రావులపాలెం రూరల్ సిఐ విద్యాసాగర్, తన సిబ్బంది ఆమెను రక్షించి, ఆలమూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆమెకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు, ఆమెను తన బంధువులకు అప్పగించారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్

విశాలాంధ్ర– సీతానగరం: అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసిన అధికారులు. మండలంలో గల మునికూడలి గ్రామ పంచాయితీ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్ ను విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారులు అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు. ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూన్ 1వ తేదీ నుంచి అక్టోబర్ వరకూ నదుల్లో ఎటువంటి ఇసుక తవ్వకాలు, రవాణా చేయకూడదు అని ఆదేశాలు జారీ చేశారు. కావున ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు అని పోలీసులు హెచ్చరించారు.

CHANGE OF NAME

I, **BORRA MARY SEETHA KUMARI W/o Borra Sivannarayana** D.No. 7-1/1, Lock Center, Sivakodu village, Razole Mandal, Dr. B. R. Ambedkar konaseema District, AP, I have changed my Name from **VELIGOTLA MARY SITHA KUMARI (Old Name)** to **BORRA MARY SEETHA KUMARI (New Name)** henceforth I am being called **BORRA MARY SEETHA KUMARI W/o Borra Sivannarayana** for all purposes.

ఇచ్చిన హామీలను నేరవేర్చిన ఘనత కూటమిదే: ఎమ్మెల్యే మద్దిపాటి

విశాలాంధ్ర-దేవరపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారులు వచ్చిన తర్వాత పూర్తిగా అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం చిన్నయ్య గూడెంలో శనివారం సాయంత్రం టీడీపీ సీనియర్ నాయకుడు గల మురళి అజిత్ కుమార్ స్వగృహ వద్ద జరిగిన కార్యక్రమం తల్లికి వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా గోపాలపురం నియోజకవర్గంలో 34990 మంది విద్యార్థులకు రూ.45.50 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు నారా చంద్రబాబు నాయుడును లోకేష్ బాబును పవన్ కళ్యాణ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు ఆండ్రు అనిల్ రొంగల సత్యనారాయణ, సీనియర్ నాయకులు గడ మురళి అజిత్ కుమార్, కాట్రగడ్డ శ్రీనివాస్‌చౌదరి, కోయిలమూడి చినబాబు, ముమ్మడి సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, పిన్నమనే సత్యనారాయణ, పిన్నమణి మధుబాబు, ఘనమని సురేష్, అభినసురేంద్ర, చిలకా రాజేష్, కోయిలమూడి సుధారాణి, బళ్ల సూర్యచక్రం, మింటిమి అమరావతి, ఉప్పులూరి రామారావు, బిజెపి నాయకుడు జనార్ధన్‌రావు జనసేన నాయకులు కూటమి నేతలు పాల్గొన్నారు.

ఫోర్ వీలర్ల రాకపోకలు బంద్

విశాలాంధ్ర–ఆలమూరు : మండలంలోని సూర్యారావుపేట వంతెన పై ఫోర్ వీలర్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇటీవల విశాలాంధ్ర దిన పత్రికలలో "శిథిలా వస్థలో సూర్యారావు పేట కాలువ వంతెన" అనే కథనం ప్రచురితమైన సంగతి పాఠకులకు విధితమే. దీనిపై ఆర్ అండ్ బి అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు సత్వరమే స్పందించారు. ముందుగా ఆర్ అండ్ బిఈ వెంకటరమణ పరిశీలించి మరమ్మత్తులకు ఎస్టిమేట్లు వేసి ఉన్నతాధికారులకు నివేదించారు. అలాగే పంచాయతీ అధికారులు స్పందించి ఈ రహదారిపై భారీ వాహనాలు వెళితే ప్రమాద మని గుర్తించారు. ఈ మేరకు నాలుగు చక్రాల వాహనాలు వంతెన పై నిరోధానికి అవరోధాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం వంతెనకు ఇరువైపులా సిమెంట్ కాంక్రీట్(సిసి) స్తంభాలను రోడ్డు మధ్యలో నిర్మించారు. అలాగే సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఈ ఏర్పాట్లతో బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలు గ్రామంలోకి రావాలంటే తాతపూడి మీదుగా తిరిగి రావాల్సి ఉంటుందని, ఈ వంతెన సూర్యారావుపేట గ్రామస్తులకు ఎంతో ముఖ్యమైనదని వారు తెలిపారు. ప్రజా ప్రతినిధులు అధికారులు త్వరితగతిన స్పందించి వంతెనకు మరమ్మత్తులు చేయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాట్రేనికోనలో వికసించిన బ్రహ్మ కమలం

విశాలాంధ్ర – కాట్రేనికోన : హిందూ పురాణాలలో ఒక దివ్యమైన పుష్పంగా పేరొందిన బ్రహ్మ కమలం కాట్రేనికోనలో పరిమళించింది. దీనిని బ్రహ్మ సృష్టికర్త దివి నుండి తెచ్చిన కమలంగా భావిస్తారు. స్థానిక యాదవుల వీధిలో మట్టపర్తి అనంతలక్ష్మి ఇంటి పెరటిలో పెంచుకున్న మొక్కకు శుక్రవారం రాత్రి రెండు బ్రహ్మ కమలం పుష్పాలు విరిసాయి. వీటినుంచి మంచి సువాసన వెదజల్లుతోంది. ఇవి ఏడాదికి ఒకసారి జూన్ జూలై ఆగస్టు నెలల్లో మాత్రమే సూర్యాస్తమయం తర్వాత వికసించి సూర్యోదయానికి ముడుచుకుపోతాయి. ఈ పవిత్ర పుష్పంతో భక్తులు శివునికి పూజలు కూడా చేస్తారు. ఈ పువ్వును శుభప్రదంగా ఆరాధిస్తారు. బ్రహ్మ విశ్వాన్ని సృష్టించడానికి బ్రహ్మ కమలం పువ్వును ఉపయోగించాడని చెబుతుంటారు. ఉత్తరాఖండ్ హిమాలయాల్లోని ఎత్తైన ప్రాంతాల్లో కనిపించే ఈ అరుదైన బ్రహ్మ కమలం మొక్కలు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎక్కువగా వికసిస్తున్నాయి.

తల్లికి వందనానికి ఆంక్షలు తగునా

విశాలాంధ్ర – పిఠాపురం : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలో భాగంగా నిన్నటి రోజున తల్లికి వందనం అని కొన్ని ఆంక్షలు మధ్య చిన్నారులు తల్లిదండ్రులు అకౌంట్‌లో వేశారు. ఎన్నికలు ముందు షరతులు లేని హామీ ఉత్సాహంగా ఇచ్చి అమలు చేయడంతో నేడు దిక్కులు చూస్తున్నారని, విద్యుత్ కలెక్షన్‌కి కుటుంబ ఆదాయానికి లింకల ఆంక్షలు పెట్టడం సరికాదని సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ శని వారం పాతికేయుల సమావేశంలో మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో నీకు 15వేలు నీకు 15వేలు అని ఊకదంపుడు ప్రచారం చేసి, గత వైసిపి ప్రభుత్వం 2వేలు మినహాయించు చేసి 13వేలు అకౌంట్లో వేసినట్టుగానే కూటమి ప్రభుత్వం జగన్ బాటలోనే నడుస్తుందన్నారు. ఈతంతు చూస్తుంటే సీసామారిందిగాని పచ్చడి పాతదన్నట్లుగా ఉందని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. ప్రజలకు హామీల హామీల ఆశల పల్లకి ఎక్కించి ఓట్లు వేయించుకున్న ప్రభుత్వాలు గద్దెక్కిన తర్వాత పథకాలు అమలు చేయడంలో పెదవిరడం మంచి పద్ధతి కాదని, చేతగాని హామీలు ఇచ్చి ప్రజలు మోసం మోసపుచ్చడం సరికాదని ఆయన మండిపడ్డారు. 2024కి చేయవలసిన ఒక దఫా తల్లికి వందనం ఎగనామం పెట్టినట్టేనని ఈ నాలుగు సంవత్సరాలు కాలలోనైనా సరిగ్గా అమలు చేయలన్నారు. హామీల భ్రమకల్పించి ఓట్లు వేయించుకుని మోసం చేస్తే సహించబోమని రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆర్డీవో కార్యాలయంలో
ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర – కాకినాడ : కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగుల సౌకర్యార్థం డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు రెవెన్యూ అధికారులతో కలిసి ప్రారంభించారు. కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన సుమారు 450 మంది రెవెన్యూ ఉద్యోగులు వారి కుటుంబీకులు ఈ కంటి వైద్య శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలకు ప్రతిపాదించారు. రెవెన్యూ ఉద్యోగుల అవసరాను దృష్టిలో ఉంచు కుని ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేసిన కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారిని, డా అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్యులను ఈ సందర్భంగా డీఆర్వో వెంకటరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి డీబీఐ చైనులు, కాకినాడ రూరల్ మండలం తహసీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, ఆర్డీవో కార్యాలయం సిబ్బంది కెవెస్వి సుబ్బారావు, కృష్ణ, దుర్గాప్రసాద్, రమణ మూర్తి ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర – అమలాపురం : అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ ప్రపంచవ్యాప్త వేడుకకు 11వ వార్షికోత్సవం. "ఒక భూమి కోసం యోగా, ఒక ఆరోగ్యం" అనే థీమ్‌తో ఈ సంవత్సరం యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. 14న విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది వరుస యోగా సెషన్‌ల కోసం సమావేశమై నప్పుడు కిమ్స్ దంత కళాశాల ప్రాంగణం ప్రశాంతతతో ప్రతిధ్వనించింది. అనుభవ జ్ఞుడైన బోధకుడు డాక్టర్ కె వెంకటేశ్వరరావు పాల్గొనీ వారికి మనస్సు, శరీరాన్ని పునరుజ్జీవింపజేయడానికి ఉద్దేశించిన వివిధ ఆసనాలు, శ్వాసవ్యాయామాల ద్వారా మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో యోగా సెషన్‌లు ఆత్మవిశ్వాసం, స్థితిస్థాపక తను పెంపొందించడంలో యోగా యొక్క పరివర్తన శక్తిని హైలైట్ చేసే చర్చలు ఉన్నాయి. కార్యక్రమంలో కిమ్స్ డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఇందుకు గాను కిమ్స్ ఛైర్మన్ చైతన్యరాజు, ఎండి రవివర్మ, జేఎండి శేష పవిత్ర అభినందించారు.

వికలాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే రేషన్

విశాలాంధ్ర – ఆలమూరు : మండల పరిధిలోని 18 గ్రామాల్లోని డీలర్లు అందరూ వికలాంగులకు, వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ అందజేయాలని తాహసీల్దార్ కెజె ప్రకాష్ బాబు, ఎంఎస్ఓ పద్మ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం మండలంలోని జొన్నాడలో రేషన్ డీలర్లు వికలాంగులకు, వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ అందజేశారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ వికలాంగులు వృద్ధులు తొందరపడి రేషన్ షాపులకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికి వారి ఇంటి వద్దే రేషన్ అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జొన్నాడ రేషన్ డీలర్లు వేలంగి వెంకట్రాజు, వీరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం

- యోగాంధ్ర విజయవంతం
- నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ

విశాలాంధ్ర - రాజానగరం : శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. మండలం లోని ఆదికవి నన్నయ వర్సిటీ నందు శనివారం జరిగిన యోగాంధ్ర విజయవంతం చేశారు.యోగా గురువు ఎన్ శివశంకర్ నేతృత్వంలో ప్రాణాయామం, ఆసనాలను సాధన చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు మే 21 వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో యోగాంధ్ర 2025 పేరుతో వివిధ రకాల యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. "వన్ ఎర్త్ - వన్ హెల్త్" నినాదంతో అందరూ యోగ సాధన చేయాలని పిలుపునిచ్చారు.నన్నయ వర్సిటీ స్థాయిలో ఈ నెల 18వ తేదీన మెగా యోగాంధ్ర ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని, విశ్వవిద్యాలయం ప్రాంగణంతో పాటు అనుబంధ కళాశాలలు దీనిలో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్. పీవోలు, కళాశాలల యాజమాన్యాలు యోగాంధ్ర ప్రోగ్రామ్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే విద్యార్థుల అందరూ యోగాంధ్ర పోర్టల్‌లో https://uatapcce.aptonline.in:8443/YogaAndhraHE/Views/studentregistration రిజిస్ట్రేషన్ చేయించుకొనే విధంగా అధ్యాప కులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, అధ్యాప కులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా...

ఎస్సీ కమిషన్ చైర్మన్ : జవహర్

విశాలాంధ్ర-తాళ్లపూడి : దళితులకు సంభందించి తమకు అన్యాయం జరిగిందని భావిస్తే తనకు ఫోన్ చేయవచ్చని, అమరావతి కార్యాలయం లో ప్రతి మంగళ బుధ వారాలు గ్రీవెన్స్ తీసుకుంటామని, అలాగే ప్రతి గురు, శుక్రవారాల్లో తనకు అందిన ఫిర్యాదులు పై సమీక్షించ టానికి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ పేర్కొన్నారు. ఆయన శనివారం తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం విచ్చేసారు. ఈ సందర్భంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా తాను ఎప్పుడూ దళితులకు అందుబాటులోనే ఉంటానని, ఫోన్ చేస్తే పలుకుతానని ఆయన వెల్లడించారు. అలాగే కమిషన్ విధులు పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కూడా సమయం కేటాయిస్తానని ఆయన పేర్కొన్నారు. కాగా తాళ్ల పూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో గల గోదావరి మేరిమాత ఆలయం లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఫాదర్ జాన్ ప్రత్యేక ప్రార్థనలు జరిపి జవహర్ ను ఆశీర్వదించారు. అనంతరం జవహర్‌కు పదవి వచ్చిన సందర్భాన్నా కేకు కట్ చేయించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ జాన్, కొత్తపల్లి ఆశిష్ లాల్, పసలపూడి బోసు, అత్కూరి రాంబాబు, నామా సురేంద్ర కుమార్, కొప్పాక నరసయ్య, తిగిరిపల్లి శ్రీను, కలిశెట్టి సన్యాసి నాయుడు, కొప్పాక పోసియ్య, మెరిపో వీర్రాజు, తీగిరిపల్లి శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌ను మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి : మాజీ ఎంపీభరత్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : దళిత మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి గర్భవతిని చేసిన సత్యదేవ్‌పై వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చెయ్యాలని రాజమండ్రి మాజీ ఎంపి మార్గాని భరత్ డిమాండ్ చేసారు.రాజమండ్రి వివిఎల్‌పురంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మైనర్ బాలి కను మోసం చేసిన సత్యదేవ్ ఎంఎల్ఏ ఆదిరెడ్డి అనుచరుడని, అందువలనే గత నలభై రోజులుగా భాదితురాలు పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్న కేసు నమోదు చెయ్యలేదని విమర్శించారు. ఆప్రజా ప్రతినిధి అండదండలు ఉన్నాయన్నారు.2022 సంవత్సరం నుండి మైనర్ బాలికను సత్యదేశ్ శారీరకంగా అనుభవిస్తున్నాడని, ఆమె గర్భం దాల్చడంతో ధవళేశ్వరంలోని ఒక హాస్పటల్‌లో అపరేషన్ చేసి మగ బిడ్డను బయటకు తీసారని చెప్పారు.ఆ మగబిడ్డను తరువాత చంపేసారని మాజీ ఎంపి భరత్ ఆరోపించారు. భాదితురాలు తనను పెళ్లి చేసుకోవాలని కోరినప్పటికీ సత్యదేవ్ అందుకు నిరాకరించాడని ఆయన అన్నారు. సత్యదేవ్‌పై గతంలో రౌడీ షీట్ ఉండేదని, ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎంఎల్ఏ అయిన తరువాత రౌడీ షీట్ ఎత్తించి వేయించారని చెప్పారు. సత్యదేవ్‌పై కేసు నమోదు చేసి బాధితురాలితో పెళ్లి జరిపించాలని డిమాండ్ చేసారు.భాదితురాలికి పుట్టిన బిడ్డ ఫోటోను మీడియా సమావేశంలో చూపి ంచారు. బిడ్డను చంపే హక్కును సత్యదేవ్‌కు, ఆప రేషన్ చేసిన డాక్టర్‌కు లేదని దీనిపై విచారణ జరిపి ంచాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకంలో ఒకొక్కరికి 15 వేల రూపాయిలు వేస్తా మని చెప్పి రూ.13 వే లు మాత్రమే ఇచ్చా రని, కూటమి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసింద న్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ అమలవుతు న్నాయో కూటమి నేతలు చూపించాలన్నారు.

రక్తదానం చేయండి, ప్రాణదాతలు కండి: ఎమ్మెల్యే దేవ

విశాలాంధ్ర రాజోలు : వరల్డ్ బ్లడ్ డోనర్ డే సందర్భంగా రాజోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదానం గురించి ప్రతిజ్ఞ చేసి, "రక్తదానం చేయండి, ప్రాణదాతలు కండి" అని పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది రక్తదానం ఆవశ్యకతను ప్రతిబింబించేలా నిర్వహించిన ప్లకార్డుల ప్రదర్శన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం రక్తం దానం చేసిన దాతలను ఎమ్మెల్యే అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య సంరక్షణ పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - కడియం : ఎన్డీఏ కూటమి రాజ్యాంగాన్ని తూట్లు పొడిచేలా వ్యవహరిస్తుందని, ప్రతి ఒక్కరు ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి రూరల్ కోఆర్డినేటర్ తాడాల కొండ్రాజు అన్నారు. కడియం మండలం, బుర్రిలంక గ్రామం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజాస్వామ్య సంరక్షణ రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమానికి సంబంధించి కరపత్రాన్ని శని వారం తాడాల కొండ్రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎన్టీయుసి జిల్లా అధ్యక్షుడు జెటి రామారావు, కడియం మండల అధ్యక్షులు పిఎస్ఎన్ రాజు, రాజమండ్రి రూరల్ మండలం అధ్యక్షులు యాళ్ల వీరభద్రరావు, మాజీ మండల అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, ఉలిసెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయంను అందజేశారు. ఈ ఆర్థిక సహకారంను బాధితులకు కొంత ధైర్యాన్ని కల్పిస్తుందని హెల్పింగ్ యూత్ సభ్యులు అన్నారు. స్థానిక క్వారీపేట, శాంతి నగర్ కాలనీకి చెందిన దెయ్యాల అప్పలరాజు పూరిళ్ళులో జీవనం సాగిస్తున్న తరు ణంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి పూర్తిస్థాయిలో ఇల్లు మొత్తం కాలిపోవడంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. దీంతో బాధితులకు హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, వంట సామాగ్రి, ఫ్యాన్‌తో పాటు, 1000 రూపాయలు ఆర్థిక సహాయన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ యూత్ సభ్యులు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న బాధితులను కొంతమేర ఆదుకునే అందుకు హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్లప్పుడూ ముందుంటుంది అన్నారు. బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు ముందుకు రావాలని కోరారు. కోక వెంకటేష్, ఎం స్వరూపు, ఎస్‌కె అలీషా, ఎస్‌కె అలీ, కే దుర్గా ప్రసాద్, పెండ్యాల రాజు, హెల్పింగ్ సభ్యులు పాల్గొన్నారు.

కాలువ గట్లపై ఆక్రమణలు తొలగించాలి

నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి విజ్ఞప్తి

విశాలాంధ్ర - ఆలమూరు : పంట కాలువ గట్లను ఆక్రమించుకుని ఏవైనా ఏర్పాటు చేసుకుని ఉన్నట్లయితే స్వచ్ఛందంగా తొలగించుకుని సహకరించా లని నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు చౌదరి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని పెదపల్ల ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ గట్లపై రాకపోకలు నియంత్రించేలా పలువురు గడ్డి మెట్లు వివిధరకాల చెట్లను పెంచుతూ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నా రన్నారు. ఇకనైనా ప్రతి ఒక్కరూ తమ పరిధిలో ఉన్న వాటిని వేగంగా స్పందించి తొలగించాలని కోరారు. మరి ముఖ్యంగా గ్రామాల పరిధిలో చెత్తంతా డ్రైనేజీ వ్యవస్థ ద్వారా పంట కాలువలలోకి విడుదల చేస్తున్నారని ఇది ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదన్నారు. అలా ఎవరైనా చేస్తున్నట్లయితే వాటిని కాలువలోకి రాకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. దీనిపై రైతులందరూ సమిష్టిగా నిరోధించడానికి సహకరించా లని ఆయన విజ్ఞప్తి చేశారు. చింతలూరు నీటి సంఘం పరిధిలోని పంట కాలువలోకి విజ్ఞప్తులను అతిక్రమించి పనులు చేస్తున్నట్లయితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

హెల్మెట్ వాడకం, సైబర్ నేరాలపైన అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ టౌన్ : 14న, "కాకినాడ కమర్షియల్ రోడ్" నందు "నెంబర్ ప్లేట్స్ సరిగా లేని వాహనాల పైన", హెల్మెట్ వాడకం పైన, ట్రాఫిక్ రూల్స్ పైన "సైబర్ నేరాలపైనలి అవగాహన కార్యక్రమం నిర్వహించిన కాకినాడ ట్రాఫిక్-1 పోలీసులు. మోటార్ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ గవర్నమెంట్ వారు జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని. మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్‌ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని, సెల్ ఫోన్లో మాట్లాడుతు డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటించాలని, ఎంవీ యాక్ట్ కొత్త చట్టం ప్రకారం తప్పుచేసిన వాహనదారులకు భారీ జరిమానాలు విధించబడునని తెలిపారు. **తదుపరి : సైబర్ నేరాలలో భాగముగా :** 1) ఆన్లైన్ మోసాలు, 2) ఫేక్ లోన్స్ మోసాలు, 3) ఆన్లైన్ జాబ్స్/వర్క్స్, 4) డిజిటల్ అరెస్ట్స్, 5) 112/100, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి వివరించినారు. ఈ కార్యక్రమం నందు ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ చీ రమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కడియం పంచాయతీలో "యోగాంధ్ర"

విశాలాంధ్ర - కడియం : యోగా సాధన వలన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ అన్నారు. కడియం పంచాయతీ కార్యాలయంలో శని వారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ యోగా దినచర్యలో ఒక భాగం కావాలన్నారు. యాంత్రిక జీవితంలో యోగా అనేది గొప్ప ఔషధంగా పనిచేస్తుందన్నారు. స్థానిక అధికారులు సిబ్బందితో కలిసి యోగా ఆసనాలు ప్రదర్శించారు.

ప్రతి హామీ అమలు కావటం తథ్యం ఎమ్మెల్యే చిన రాజప్ప

విశాలాంధ్ర - సామర్లకోట : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోటలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే కుటుంబానికి చెందిన ఐదు మంది విద్యార్థులకు తల్లికి వందనం మంజూరు కావడం విశేషమని ఎమ్మెల్యే చినరాజప్ప వివరించారు. డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, ఎమ్మెల్యే చినరాజప్ప, కూటమి నేతలు సామర్లకోటలోని పలువురు లబ్ధిదారులతో కలిసి తల్లికి వందనం అమలుపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అడబాల కుమారస్వామి, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, సరోజ వాసు, బలుసు వాసు, మడగల శ్యామ్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం మెరుగు

విశాలాంధ్ర - అనపర్తి : ప్రజలు తమ జీవన విధానంలో యోగాను భాగంగా చేసుకుని ఆరోగ్యమైన జీవనం సాగించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి అన్నారు. శనివారం స్థానిక శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో యోగాంధ్ర క్యాంపెయిన్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ కార్యక్రమంలో యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని, ప్రతి ఒక్కరు యోగాను దిన చర్యగా చేసుకో వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), ఎంపిడివో ఎం రామ కృష్ణారెడ్డి, తాహసిల్దార్ అనిల్ కుమార్, ఎంఈవో సత్తిరెడ్డి, ఇంకా పలువురు అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహర్షి సాంబమూర్తి ఆశ్రమ పాఠశాలలో దివ్యాంగ బాలికలకు "యోగ శిక్షణ"

విశాలాంధ్ర-కాకినాడ : జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం స్థానిక కల్పనా సెంటర్ వద్ద గల మహర్షి సాంబమూర్తి దివ్యాంగుల బాలికల ఆశ్రమ పాఠశాల నందు దివ్యాంగ బాలికలకు ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ యోగ విద్య పీఠం రాష్ట్ర అధ్యక్షులు, యోగాచార్య చిట్టూరి చిట్టిబాబుచే ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది, సాంబమూర్తి ఆశ్రమ పాఠశాల చైర్మన్ జవహర్ ఆలీ విచ్చేసి ఉచిత యోగ శిక్షణ తరగతులు ప్రారంభించారు. యోగాచార్య మాట్లాడుతూ యోగ ద్వారా అంతరంగిక పరిశుద్ధత, స్వస్థత, మనోబలం, ఆత్మవిశ్వాసం, సద్భావన, స్వీయ అవగాహన, చైతన్యంతో కూడిన జీవనం సాధ్యమవుతాయన్నారు. ఉచిత యోగ శిబిరాల్లో భాగంగా వారానికి ఒకరోజు హాస్టల్ నందు ఉచిత యోగ శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, జి పద్మ తదితర ఉపాధ్యాయులు దివ్యాంగ చిన్నారులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన ఎస్సై లక్ష్మీకాంతం

విశాలాంధ్ర- ప్రత్తిపాడు : మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన నిస్సి గోల్డ్ అనే 15 సంవత్సరాలు అమ్మాయి ఈ నెల 12న మధ్యాహ్నం 12 గంటలకు కనిపించకుండా పోయినట్లు, గుర్తించిన ఆమె తల్లిదండ్రులు, బంధువులు చుట్టూ ప్రక్కల వెతికినా ఆచూకి దొరకకపోవడంతో వారి తల్లి దండ్రులు ఈ నెల 13వ తేదీ రాత్రి 10 గంటలకు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బాలిక మిస్సింగ్ అయినట్లు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే సిఐ బివిఎస్ అప్పారావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం వారి సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీ చేపట్టారు. మిస్సింగ్ అయిన అమ్మాయిని అత్యంత చాకచక్యంగా కేసు నమోదు అయిన 12 గంటల వ్యవధిలో అమ్మాయి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకి అప్పగించారు. కృషి చేసిన ఎస్సై లక్ష్మీ కాంతంను, వారి సిబ్బందిని డిఎస్పీ, సిఐలతో పలువురు పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

విశాలాంధ్ర - రాజోలు : క్రీడల వల్ల శారీరక, మానసికఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెరిగి జీవిత లక్ష్యాలను సాధించేందుకు దోహదపడుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. శనివారం రాజోలు ఎల్‌బి నగర్‌లో వేమా స్వగృహం వద్ద జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారు లను సత్కరించారు. ఈ సందర్భంగా వేమ మాట్లాడుతూ ఈనెల 9,10,11 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన 31 ఇంటర్నల్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు రాజోలు ప్రాంత క్రీడాకారులు ఎంపిక అవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన జి దినేష్ ఆదిత్య, వెంకటేష్, వై గంగా భవాని, సిల్వర్ మెడల్ సాధించిన వై లక్ష్మీ శశిరేఖ, బ్రాంజ్ మెడల్ సాధించిన కె దాత్రిజ, హేమ సత్యశ్రీ, భవనేష్‌లను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లను వేమా అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ జొన్నల గడ్డ గోపాలకృష్ణ, ముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు లతేంద్ర వర్మ, కరాటే మాస్టర్ కర్రి విజయ నారాయణ, పాల్గొన్నారు.

కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో యోగాంధ్ర

విశాలాంధ్ర-కొవ్వూరు : సుందర గోదావరి తీరాన, ప్రభాత కిరణాల వెలుగులో, పక్షుల కిలకిల రావాలు, మనోహర ప్రకృతి దృశ్యాల మధ్య, ఆధ్యాత్మిక శోభ తో విరాజిల్లే కొవ్వూరు గోష్పాద క్షేత్రం విఐపి ఘాట్ లో "యోగాంధ్ర" రాష్ట్రస్థాయి కార్యక్రమం శనివారం విజయవంతంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు ఆధ్వర్యంలో జరిగింది. ఆర్డీవో రాణి సుస్మిత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అత్యంత ఉత్సాహంతో కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, వేద పాఠశాల విద్యార్థులు, వయోవృద్ధులు, మహిళలు, యువత, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తో "ఆర్ట్ ఆఫ్ లివింగ్" సంస్థకు చెందిన యోగ గురువు సరోజ యోగాసనాలు వేయించారు. అనంతరం బ్రహ్మకుమారి సోదరి రాజయోగ ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు నిర్వహించే కార్యక్రమానికి సన్నద్ధంగా ఈరోజు యోగా సాధన ట్రయల్ రన్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గోష్పాద క్షేత్రం అటు ఆధ్యాత్మికంగానూ, ఇటు పర్యాటకం గానూ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం అయిన 21న కూడా ఇదే ఉత్సాహంతో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ యోగ ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారు ఢ్యం లభిస్తాయని చెప్పారు. వృక్షాసనం ఆకృతిలో కూర్చున్న యోగ సాధకులను అభినందించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసిన విద్యార్థులు, అధికారులు, అన్ని శాఖల సిబ్బందికి ఆర్డీవో కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కొవ్వూరు చైర్ పర్సన్ బావన రత్నకుమారి, డివిఎల్‌ఓ స్వీవా రెడ్డి, కమిషనర్ టీ నాగేంద్ర కుమార్, వివిధ శాఖల అధికారులు , స్థానిక ప్రజాప్రతినిధులు, వేద పండితులు, విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సూర్య సంతోష్ రెడ్డిని సత్కరించిన తిరుమలరావు

విశాలాంధ్ర - పెదపూడి, అనపర్తి : నీట్ ఆల్ ఇండియా స్థాయిలో మల్లిడి సూర్య సంతోష్ రెడ్డి 1518వ ర్యాంక్‌ను సాధించాడు. శనివారం వైద్య విద్య ప్రవేశ పరీక్ష ఫలితాల్లో రికార్డు స్థాయిలో ర్యాంకు సాధించిన మల్లిడి సూర్య సంతోష్‌రెడ్డిని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమల రావు (రాజమహేంద్రవరం) ఘనంగా సత్కరించారు. సూర్య సంతోష్ రెడ్డి ఇటీవల ఎంసెట్లో 12వ ర్యాంకు సాధించారు. దీంతో దేశంలోనే ప్రముఖ వైద్య విద్యాశాల (ఎయిమ్స్)లో ఉచితంగా సీటు లభించనున్నది. సంతోష్ రెడ్డి తండ్రి డాక్టర్ కృష్ణారెడ్డి పందలపాకలో ఆసుపత్రి ప్రారంభించి ఇప్పటికే వైద్య సేవలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. నీట్ ర్యాంకు సాధించిన సంతోష్ రెడ్డిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఐఎంఏ అనపర్తి శాఖ అధ్యక్షులు, నియో జకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి, అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తాడి రామ గుర్రెడ్డి, నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను) తదితరులు అభినందించారు.

రక్త దాతల దినోత్సవం

విశాలాంధ్ర-గండేపల్లి : గండేపల్లి మండలం సూరం పాలెం, ఆదిత్య యూనివర్సిటీ, గవర్నమెంట్ జనరల్ హాస్పి టల్ కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి మాట్లాడుతూ ప్రపంచ రక్తదాతల దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోని ప్రజలకు రక్తం విలువని తెలపాలనే ఉద్దేశంతో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఏటా జూన్ 14న నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా డా ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ శిబిర ంలో ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, కాకినాడ వైద్య అధికారి డా బి శ్రీహరిబాబు, వారి సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో అధ్యాపకులు, టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ సిబ్బంది 60 యూనిట్స్ బ్లడ్ డొనేట్ చేశారు. వారి అందరినీ డా ఎం శ్రీనివాస రెడ్డి అభినందిస్తూ సర్టిఫికెట్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రోఛాన్సలర్ డా మేడపాటి శ్రీనివాసరెడ్డి, సిహెచ్. రామ ప్రసాద్ తెలియజేశారు.

హంసికకు 33వ ర్యాంక్



విశాలాంధ్ర-అనపర్తి : స్థానిక జిబిఆర్ జూనియర్ కళా శాల విద్యార్థిని పందిరి హంసిక 33వ ర్యాంకు సాధిం చినట్లు ప్రిన్సిపల్ పిఆర్ఎల్ స్వామి తెలిపారు. శనివారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బిఎస్సి అగ్రికల్చర్ ఆనర్స్ నాలుగు సంవత్సరాల కోర్స్ సంబంధించి హంసిక ఈ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ర్యాంకు సాధించిన హంసిక ను జిబిఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు), డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్ పి అబ్బాయి రెడ్డి, డైరెక్టర్లు బి రత్నారెడ్డి, గొలుగూరి జగన్నాథరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

శనీశ్వరుని దర్శించుకున్న భక్తులు

విశాలాంధ్ర - కొత్తపేట : కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర శనీశరస్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శనివారం కావడంతో భక్తులు తైలాభిషేకములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తైలాభిషేకముల ద్వారా రూ. 1,65,420అన్న ప్రసాదం విరాళాలుగా రూ.39,691లు మొత్తం. రూ.2,05,111 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి సూర్య చక్రధరరావు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విశాలాంధ్ర - కాకినాడ : రక్తదానం ప్రాణదానంతో సమానం రక్తదానం ప్రాణదానంతో సమానమని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్య పేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రక్తంలో ఏ, బి, ఏబి, ఓ గ్రూపులను కనుగొన్న కార్ ల్యాండ్ స్టీనర్ జూన్ 14న జన్మించడంతో ఈ రోజున రక్తదాతల దినోత్సవంగా జరుపుకుంటున్నామ న్నారు. ప్రమాదాలు, ఆపరేషన్లు, అవయవ మార్పిడి చికిత్సలు మొదలైన వాటి గురించి వినగానే గుర్తుకు వచ్చేది రక్తమే అని అన్నారు. 15 నుంచి 60 ఏళ్ల మధ్య వయసుగల వారు ఎవరైనా రక్తదానం చేయవచ్చన్నారు. పురుషులైతే మూడు నెలలకు ఒకసారి, స్త్రీలు అయితే ఆరు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని అన్నారు. రక్తదానం చేయడంలో ఆపదలో ఉన్నవారి జీవితాలను కాపాడమేే గాక వారు మరింత దీర్ఘకాలం ఉత్సాహంగా పనిచేయగలిగే జీవితాన్ని ప్రసాదించడమేనని డాక్టర్ అడ్డాల తెలిపారు. ఈ సందర్భంగా 118 సార్లు రక్తదానం చేసిన జి కృష్ణమోహన్‌ను అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శిరీష, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జులై 1 చలో రాజానగరం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : మోటారు వాహన చట్టంలో తీసుకువచ్చిన మార్పులకు వ్యతిరేకంగా జులై 1న నిర్వహించ తలపెట్టిన చలో రాజానగరం కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కార్మిక సంఘాల నాయకుల జేఏసి నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్‌లు పిలుపు నిచ్చారు. శనివారం రాజమండ్రి కంబాల చెరువు మెగా పార్టీ రూమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రవాణా వాహనాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తుందని, నిబంధనాలు మార్చి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రైవేటు ఏటిఎస్ సెంటర్ల ద్వారా సెంటర్ల ద్వారా నిర్వహిస్తున్న వాహన ఫిట్‌నెస్ పరీక్షల వలన యజ మానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.చివరకు వారి వాహ నాల ఇంజన్లకు కూడా నష్టం జరుగుతుందన్నారు.రవాణా శాఖ ఎంవిఐల ద్వారా చెల్లించా ల్సిన ఈ పరీక్షా విధానాన్ని ప్రవేటు సంస్థకు అప్పచెప్పడం వలన ఆన్‌లైన్ చలానా చార్జీలతో పాటు సమయం కూడా వృధా అవుతుంద న్నారు. తూర్పు గోదావరి జిల్లాకు ఒకే ఏటిఎస్ రాజానగరంలో ఉందన్నారు. అక్కడకు ఫిట్ నెస్ పరీక్షలకు వెళ్ళి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెద్ద వాహనాలకు నాలుగు వందలు, చిన్న వాహనాలకు రెండు వందలు చార్జీలు పెంచడం జరిగిందన్నారు.పెద్ద వాహనాలకు 1320, చిన్న వాహనాలకు రూ.920 రూపాయిలు ఆన్ లైనల్‌లో చలానా కట్టిన తరువాత సుమారు ఆరు గంటల వరకు ఉండవలసి వస్తుందన్నారు.పరీక్షల తరువాత ఓకే అయ్యిందో లేదో వారం రోజుల పాటు ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. అప్పటి వరకు వాహనాన్ని రోడ్డు పైకి తీసుకురాకూడదన్నారు.అయితే గుజరాత్‌లో మాత్రం ఏటిఎస్ సెంటర్ లేదా ఎంవిఐ రెండు విధానలు ఉన్నాయని, వాహనదారుడు ఎందులోనైనా చెల్లించవచ్చునన్నారు.ఏపిలో కూడా ఆ విధానాన్ని అమలు చేసి రవాణా రంగాన్ని కాపాడాలని కోరారు. పోలుపల్లి నాగేశ్వరరావు, అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు వాసంశెట్టి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు ఆటోనగర్ అభివృద్ధికి సహకరించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-భీమవరం టౌన్: ఏలూరు ఆటోనగర్ అభివృద్ధికి సహకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ది ఏలూరు టౌన్ ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరుణతార నాగేశ్వరరావు, కార్యదర్శి అడపా సత్యనారాయణ, కమిటీ సభ్యులు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజును శనివారం భీమవరం క్యాంప్ కార్యాలయం నందు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఏలూరు ఆటోనగర్ ఏడేళ్ళుగా నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి దూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ అధ్యక్షులు మాగంటి నాగభూషణం చేసిన తప్పిదాల వల్ల హైకోర్టు నందు రిజంప్షన్ ఉన్న కారణం చేత ఆటోనగర్ నందు కనీస మౌలిక వసతులైన రోడ్డు, డ్రైనేజీ, కరెంటు వంటి కనీస సౌకర్యాలు లేక అక్కడ యూనిట్లు ఏర్పాటు చేసుకున్న వారు జీవనోపాధి కరువై అనేక ఇబ్బందులు పడుతున్నారని, కోర్టు తీర్పు అసోసియేషన్‌కు అనుకూలంగా వచ్చిన నేపథ్యంలో ఆటోనగర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజుకు వివరించారు. సమస్యలను తెలుసుకున్న చైర్మన్ రామరాజు సంబంధిత అంశా లపై పూర్తి వివరాలను తెలుసుకొని ఆటోనగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంతెన రామరాజుకు ఆటోనగర్ ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలియ జేసింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సయ్యద్ చోటే, మాజీ ఉపాధ్యక్షులు పల్లా అప్పారావు, అసోసియేషన్ సభ్యులు ఉప్పులూరి హేమ శంకర్, శాయన అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 2,100 ఎకరాలలో పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

- కలెక్టర్ పి ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పొలములలో పండ్ల తోటల పెంపకం చేపట్టే ఆసక్తి కలిగిన సన్న, చిన్న కారు రైతులకు చేయూత నివ్వడం కోసం ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో 2100 ఎకరములు లక్ష్యంగా నిర్ణయిచడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం చేపట్టుటకు జిల్లా లోని అర్హులైన సన్న/చిన్న కారు రైతుల నుండి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నామని తెలిపారు. పూర్తి వివరాలు, తగిన సూచనలు సలహాలు కోసం మీ మండల పరిధిలోని హార్టికల్చర్ అధికారి సంప్రదించాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరం 2024-2025 లో 500 ఎకరములు లక్ష్యంగా నిర్ణయయించగా, లక్ష్యాలను మించి తూర్పు గోదావరి జిల్లాలో 643 ఎకరములలో పండ్ల తోటల పెంపకచేపట్టడమైనదన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సాహం అందించడం కొరకు మామిడి, జీడి మామిడి, ఆయిల్ పాం, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, బత్తాయి, కొబ్బరి, సపోటా, సీతాఫలం, కోకో వంటి తదితర 26 రకాల పండ్ల తోటల పెంపకంనకు అనుమతించడం జరిగి oదన్నారు. మూడు సంవత్సరముల నిర్వహణ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు ఉచితంగా చెల్లించ నున్నట్లు తెలిపారు. రైతులకు కల్పిం చే లబ్ధి కింద వివిధ రూపములలో లబ్దిదారునకు పండ్ల రకములను బట్టి ఒక ఎకరానికి 3 సంవత్సరాలకు రూ.68,103 నుండి రూ .2,51, 226 వరకు లబ్ధి చేకూరే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 25లోపు రైతులు తమ దరఖాస్తులను ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్/ గ్రామ పంచాయితీ కార్యదర్శి లేదా మండల పరిషత్ కార్యాలయం నందు అందజేయాలన్నారు. అర్హులైన లబ్ధి దారులు అందరు దరఖాస్తు చేసుకొని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమును ద్వారా చేపట్టు తున్న పండ్ల తోటల పెంపకం పని ని రైతులు సద్వినియోగం చేసుకోనవలసినదిగా డ్వామా పీడీఎమ్ నాగమల్లేశ్వర రావు తెలియచేశారు.

23 కేజీలు గంజాయి పట్టివేత

- 4 వాహనాలు సీజ్

- పట్టుబడ్డ ఇద్దరు యువకులు, పరారీలో మరో ఇద్దరు
- గుట్టురట్టు చేసిన రాజానగరం పోలీసులు
- ఉత్తర మండలి డీఎస్పీ వై.శ్రీకాంత్

విశాలాంధ్ర - రాజానగరం : కొబ్బరి కాయలు, సీసీ కెమెరాలు వ్యాపారం అని స్థానికులను నమ్మించి గుట్టుచప్పుడుకాకుండ గత కొంతకాలంగా విక్రయాలు సాగిస్తున్న గంజాయి ముఠాను రాజానగరం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలోని కొండగుంటూరు గ్రామంలో నీ కొండాలమ్మ గుడి సమీపంలోని ఒక ప్రైవేట్ లేఔట్ లోని ప్లాట్ నంబర్ 18లో గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు రాజానగరం పోలీసులు,రెవెన్యూ అధికారులు కలిసి సోదాలు నిర్వహించి 23 కేజీల గంజాయి పట్టుకున్నారు. దీనిలో భాగంగా మండలకేంద్రమైన రాజానగరం పోలీసు స్టేషన్ నందు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన విలేఖర్ల సమావేశంలో ఉత్తర మండలి డీఎస్పీ వై.శ్రీకాంత్ మాట్లాడుతూ కొండగుంటూరు లోని ఓ ప్రైవేట్ లేఔట్ నందు నిర్మించిన రేకుల షెడ్డు వద్ద ఒరిస్సా రాష్ట్రంలోని మల్కాజ్ గిరి జిల్లా చిత్రకొండ మండలం దొరగూడ గ్రామానికి చెందిన సురేష్ చంద్ర కులదీప్, అల్లూరి జిల్లా చింతూరు మండలంలోని పొల్లూరు గ్రామానికి చెందిన మనోరంజన్ మండల్ అనే ఇద్దరు యువకులు గంజాయినీ కారు నుండి దింపుతూ పట్టుపడ్డారన్నారు. వీరిని విచారించగా ఒరిస్సా రాష్ట్రానికి చెందిన రఘువీర్ రాయ్ మరియు అతని భార్య ప్రశాంతి రాయ్ తమ యజమానులు అని, ఈ నెల 13న ఒరిస్సా రాష్ట్రంలోనీ చిత్రకొండ ప్రాంతం నుండి గంజాయి కొనుగోలు చేసి టాటా ప్యూర్ ఎంహెచ్09డిఎం 2815 నంబర్ గల కారులో తీసుకువచ్చినట్లు చెప్పారు. ఆ వాహనానికి పైలట్ గా ఏపీ40 బీవీ 5131 నంబర్ గల రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్ బైక్ పై తాము వచ్చినట్లు చెప్పారు. అలాగే సంఘటన స్థలంలో ఉన్న వేస్పా ఏపీ40 హెచ్ 1702 స్కూటీని వాడకంలో గుర్తించినట్లు చెప్పారు. యుపి25డీటి 2660 నంబర్ గల గూడ్స్ వ్యాన్ గుర్తించామ న్నారు. వీటితో పాటు సంఘటన స్థలం వద్ద రఘు వీర్ రాయ్, ప్రశాంతి రాయ్ అనే ఇద్దరు వ్యక్తులు కారులో ఉన్న గంజాయి జాగ్రత్తగా దింపి లోపల పెట్టమని,తాము రాజమహేంద్రవరం సిటీలో పని చూసుకొని వస్తామని చెప్పి అక్కడ నుండి వెళ్లిపోయినట్లు చెప్పారు.తమ యజమానులు చాలా కాలం నుండి గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్టు చెప్పారు.ఆ వచ్చిన డబ్బుతో కొంతమూరు గ్రామంలో ఒక ఇల్లు కొనుక్కొని,ఆ తర్వాత సదరు ఇల్లు అమ్మేసి కొండగుంటూరు గ్రామంలో స్థలం కొనుగోలు చేసి,అక్కడ బిల్డింగ్ కడుతున్నట్లు చెప్పారన్నారు. పట్టుబడ్డ 23.101 గ్రాముల గంజాయి ధర లక్ష రూపాయలు ఉండగా సదరు నాలుగు వాహనాలు సీజ్ చేశామని వాటి ధర సుమారు 30 లక్షలు ఉంటుందని చెప్పారు. అలాగే రేకులు షేడ్ సీజ్ చేసేందుకు జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రస్తుతం నేరస్తులైన రఘువీర్ రాయ్,ప్రశాంతి రాయ్ పరారీలో ఉన్నారని, వీరిపై గతంలో కోరుకొండ, గోకవరం, విశాఖపట్నం, మరి కొన్నిచోట్ల కేసులు ఉన్నాయని స్పష్టం చేశారు. నేరస్తులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ కె.వి నాగార్జున, సిబ్బంది కరీం, సురేష్, త్రిమూర్తులు, రూమా మహేశ్వరరావు, మురళీ, రాంప్రసాద్, నాగార్జున అభినందించారు.

అల్లం గోపాలరావు మృతి కళారంగానికి తీరనిలోటు

విశాలాంధ్ర-ఏలూరు : ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారుడు, సినీ నటుడు అల్లం గోపాలరావు మృతికి సీపీఐ, ఏపీ ప్రజా నాట్యమండలి, బీకేఎంయూ జిల్లా సమితులు ఓ ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపాయి. గోపాలరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి ఏలూరు ఏరియా కార్యదర్శి తమ్మా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గోపాలరావు తొలినాళ్ళలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజానాట్యమండలిలో ప్రముఖ పాత్ర నిర్వహించారన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన గోపాలరావు సమాజంలో మంచి మార్పుకు ఎనలేని కృషి నిర్వహించారన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏఐవైఎఫ్ అధ్యక్షులుగా పనిచేశారని వారు పేర్కొన్నారు. సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు, ప్రజలలో చైతన్యం నింపేందుకు ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి తనవంతు కృషి నిర్వహించిన గొప్ప అభ్యుదయవాది గోపాలరావు అన్నారు.ఆతర్వాత కాలంలో సినీ రంగంలో ప్రవేశించారని పలు చిత్రాల్లో, సీరియల్స్‌లో నటుడుగా మంచి గుర్తింపు పొందారన్నారు. అభ్యదయ భావాలు కలిగిన గోపాలరావు మృతి కళారంగానికి తీరని లోటని పేర్కొన్నారు. అల్లం గోపాలరావు మృతికి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ప్రజానాట్యమండలి నాయకులు బళ్ళ కనక దుర్గారావు, గేదెల నాగేశ్వరరావు, పల్లె వెంకటనారాయణ, వాకాడ రాజారావు, సీపీఐ నాయకులు కడుపు కన్నయ్య, యర్రా వెంకటేశ్వర్లు,అభ్యుదయవాదులు పి పీ శాస్త్రి, పిఎస్ చందు, ఎస్ సంజీవరావు, సాంబశివరావు సంతాపం తెలిపారు.

నేడు సీపీఐ జిల్లా మహాసభల సన్నాహక సమావేశం

విశాలాంధ్ర - అమలాపురం : సీపీఐ జిల్లా మహాసభలు జూలై 19, 20, 21, మూడు రోజులు పాటు అమలాపురంలో నిర్వహించుటకు ఆహ్వాన సంఘం సమావేశం నేడు 10 గం.కు అమలాపురం ఎస్టీయూ కార్యాలయం నందు పార్టీ కౌన్సిల్ విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర పార్టీ కార్యదర్శి వర్గసభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధులు హాజరవుతున్నారు. కావున గౌరవకౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు అందరూ సకాలంలో హాజరు కావాలని జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు కోరారు.

హైవే ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో సోలార్ లైటింగ్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జాతీయ రహదారులు జరిగే ప్రమాదాల నివారణకు పటిష్ట జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ కే ప్రతాప్ శివ కిషోర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా జాతీయ రహదారిలోని బ్లాక్ స్పాట్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రమాద సూచికలతో పాటు సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల కాలంలో ఏలూరు నగరం లోని జాతీయ రహదారిలో గల వ్యాసగాని బ్రిడ్జి నుండి ఆశ్రమం ఆసుపత్రి మధ్యలో అనేక ట్రావెల్ బస్సులు బోల్తా పడి ప్రమాదానికి గురి అయ్యాయి. నేషనల్ హైవేలోని ఈ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణ కోసం రాత్రి వేళ లైటింగ్ కనిపించకపోవడం, కాషనరీ సూచన బోర్డులు లేకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించింది. దీంతో ప్రమాద నివా రణ చర్యల్లో భాగంగా ఎస్పీ ఆదేశాలపై జిల్లా ట్రాఫిక్ విభాగం చర్యలు చేపట్టి నేషనల్ హైవే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి జాతీయ రహదారులు ప్రమాద ప్రాంతాలుగా గుర్తించిన చోట శనివారం సోలార్ స్ట్రీట్ లైట్లు 7, కాషనరీ సైన్ బోర్డులు 4, స్పీడ్ లిమిట్ బోర్డులు 10 ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ బ్యూరో అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒకరి జీవితం ఎంత విలువైందని, చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని హితవు పలికారు.

యోగాంధ్ర ట్రైల్ రన్



విశాలాంధ్ర - ఆత్రేయపురం : యోగాంధ్ర ట్రైల్ రన్ కార్యాక్రమంలో శనివారం రోజున ఉదయం గం.6.00లకు బొబ్బర్లంక గ్రామ సర్పంచ్ నరాల శెట్టి సుబ్బలక్ష్మి వెంకన్న, మండల స్పెషల్ ఆఫీసర్ ఎంవి రామారావు, ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకట రామన్ బొబ్బర్లంక గ్రామ సచివా లయం సందర్శించి యోగాంధ్ర ట్రైల్ రన్ యోగాంధ్ర ఔత్సాహికులతో నిర్వహించారు. అదే విధంగా అన్ని గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన వేదికలలో యోగాంధ్ర ట్రైల్ రన్ కార్యక్రమం మండల స్థాయి పర్యవేక్షణాధికారులతో నిర్వహించడమైనది. మండల పరిషత్ సిబ్బంది, అందరు పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.